ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు
శనివారం 13 జనవరి 2024

జిల్లాకు ప్రధాని మోదీ

ఈనెల 16న నాసిన్ ప్రారంభోత్సవానికి హాజరు

ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం





హిందూపురం, జనవరి 12: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జిల్లాకు రానున్నట్లు అధికారవర్గాల ద్వారా తెలిసింది. ఈనెల 16వ తేదీన మోదీ పర్యటించనున్నట్లు సమాచారం. గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామ సమీపంలో ఏర్పాటైన నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ పరోక్ష పన్నులు నార్కోటిక్స్ (నాసిన్)ను ప్రధాని ప్రారంభించనున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో జిల్లా అధికారులు నాసిన్‌ను శుక్రవారం పరిశీలించారు. వేదిక, ప్రారంభించే భవనాలను జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి పరిశీలించారు. 500 ఎకరాల్లో రూ.550 కోట్లు ఖర్చు చేసి, నాసిన్ ఏర్పాటు చేస్తున్నారు. 2017 ఏప్రిల్‌లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, అప్పటి కేంద్ర మంత్రులు వెంకయ్యనాయుడు, అరుణ్‌జైట్లీ.. నాసిన్‌కు శంకుస్థాపన చేశారు. ఐదేళ్లలో ప్రహరీ, అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టారు. అనంతరం ప్రస్తుత కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ రెండోసారి భూమిపూజ చేశారు. నాసిన్‌లో యుపీఎస్సీ ద్వారా ఎంపికైన ఐఆర్ఎస్‌లకు శిక్షణ ఇవ్వనున్నారు. నకిలీ కరెన్సీ, మనీ ల్యాండరింగ్ నేరాలు, సైబర్ సెక్యూరిటీపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. దీనిని ప్రధాన మంత్రి ప్రారంభించనున్నారు. ప్రధాని పర్యటన పూర్తి వివరాలు శనివారం వెల్లడిస్తామని జిల్లా అధికారులు పేర్కొంటున్నారు.



మంత్రి వస్తాడని ప్రధాన కూడలిలో బందోబస్తులో ఉన్న పోలీసులు (ఫైల్)

వైసీపీ సేవలో తరిస్తున్న ఖాకీ

లా అండ్ ఆర్డర్ గాలికి..

ఉదయం నుంచి రాత్రి వరకు వారి వెంటే..

ప్రముఖ హీరో.. ఎమ్మెల్యే బాలయ్యకు ఎస్కార్ట్ ఎక్కడ?

పెనుకొండలో మంత్రి భర్తకు ఎస్కార్ట్

విస్మయం వ్యక్తం చేస్తున్న జనం



అధికార పార్టీ నాయకులకు ఎన్నడూ లేని విధంగా పోలీసులు వంగి వంగి దండాలు పెడుతున్నారు. మరికొంతమంది పోలీసు అధికారులైతే తమ పోస్టుల కోసం ఖాకీని వైసీపీ నాయకులకు దాసోహం చేశారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల్లో అధికార పార్టీ నాయకుల సేవలో తరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇటీవల హిందూపురంలో సెలెబ్రిటీ అయిన స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఉండగా.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా ఉన్నారు. పక్క రాష్ట్రానికి వెళ్లిన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు డీఎస్పీ స్థాయి అధికారి బందోబస్తు నిర్వహిస్తారు. వారి పరిధిలో కార్యక్రమం ముగిసేవరకు ఎస్కార్ట్ కూడా కేటాయిస్తారు. ఎందుకంటే ఆయన ఎమ్మెల్యేతో పాటు సెలెబ్రిటీ, వీవీఐపీ కేటగిరిగా పరిగణిస్తారు. అంతా సాఫీగా సాగితే ఫర్వాలేదు. ఏదైనా జరగరానిది జరిగితే దేశవ్యాప్తంగా ఆయన అభిమానులు కన్నెర్ర చేస్తారు. ఎమ్మెల్యే స్థానికంగా ఉన్నా ఎస్కార్ట్ కేటాయించకపోవడం పట్ల ప్రజలు, ఆయన అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- హిందూపురం

శాంతిభద్రతలు గాలికి..

అధికార పార్టీ నేతలు పర్యటిస్తే పోలీసు అధికారులు లా అండ్ ఆర్డర్ చుట్టేసి పక్కనబెట్టి వైసీపీ నాయకుల వెంట పడటం సర్వసాధారణమైంది. స్టేషన్‌లో ఎస్‌హెచ్ఓ లేకపోతే బాధితులకు ఎలా న్యాయం చేకూరుతుంది? ఒకవేళ అత్యవసరమైన పనులు ఉంటే ఎవరికి చెప్పుకోవాలన్న ప్రశ్న సామాన్యుల్లో ఉత్పన్నమవుతోంది. ఇటీవల హిందూపురం పరిధిలో విచ్చలవిడిగా పేకాట, మద్యం, గంజాయి తోపాటు ఇతర అసాంఘిక కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి. పట్టుబడిన నేరస్థులే ఇందుకు నిదర్శనం. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో లా అండ్ ఆర్డర్ గాలికి వదలడం ఎంతవరకు సమంజసమని ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి.

ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసే యోచన..

ఇటీవల పురానికి బదిలీపై వచ్చిన కొంతమంది పోలీసు అధికారులు.. అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా ఉండటంపై ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిపక్షాలకు అధికారులపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఎన్నికల సమయంలో ఇలాగే కొనసాగితే ఎలా? నిష్పాక్షికంగా ఎలా వ్యవహరిస్తారని ప్రతిపక్ష పార్టీలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో నోటిఫికేషన్ వచ్చిన తరువాత ప్రస్తుత అధికారుల తీరుపై ఎన్నికల సంఘానికి ఆధారాలతో ఫిర్యాదు చేయనున్నట్లు ప్రతిపక్ష నాయకులు పేర్కొంటున్నారు.



ఇటీవల ఓ ప్రజాప్రతినిధి వెంట ఉన్న పోలీసు వాహన శ్రేణి (ఫైల్)

వైసీపీ నాయకుల వెంటే..

వైసీపీ నాయకులు నియోజకవర్గంలో పర్యటించినపుడు ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునేవరకు వారి వెంటే పోలీసులు ఉండటం సర్వసాధారణమైంది. గతంలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదని ప్రజలు వాపోతున్నారు. నాలుగు రోజులుగా నియోజకర్గంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటిస్తున్నారు. ఆయన నియోజకవర్గానికి వచ్చినప్పటి నుంచి సబ్ డివిజనల్ అధికారితోపాటు ఇక్కడున్న సీఐలు అందరూ ఆయన వెంటే ఉన్నారు. ఏ పరిధిలో కార్యక్రమం నిర్వహిస్తారో ఆ పట్టణం నుంచి సైతం ఇతర మండలాలకు పోలీసులు వెళ్తున్నారు. గతంలో ఎంతోమంది మంత్రులు పర్యటించారు. ఇంత పెద్దఎత్తున పోలీసులు బందోబస్తు నిర్వహించడం ఇదే మొదటిసారి అని చెప్పవచ్చు. ఇక్కడ పనిచేస్తున్న పోలీసు అధికారులు చిత్తూరు జిల్లా నుంచి ఇక్కడికి బదిలీ అయినవారే. దీంతో మంత్రి సేవలో తరిస్తున్నారు.

బాలయ్యకు సెక్యూరిటీ ఏదీ..?

ఇటీవల పక్క రాష్ట్రంలో ప్రముఖ సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే అయిన నందమూరి బాలకృష్ణ పర్యటించినపుడు అక్కడ డీఎస్పీ స్థాయి అధికారి దగ్గరుండి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యేకు దగ్గరగా ఉన్న నాయకులు పేర్కొన్నారు. ఎందుకంటే ఆయన ఒక ఎమ్మెల్యేతోపాటు ప్రముఖ కథానాయకుడు కూడా. అందుకే ఎక్కడ పర్యటించినా వీవీఐపీ స్థాయి భద్రత కల్పిస్తారు. గతంలో ఎమ్మెల్యే హిందూపురంలో పర్యటించినపుడు అధికార పార్టీకి చెందిన వ్యక్తులు వెంటాడి, ఆయన కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. నెలక్రితం హిందూపురానికి వచ్చినపుడు మేళాపురం వద్ద కొంతమంది అధికార పార్టీకి చెందిన చోటా మోటా నాయకులు అడ్డగించారు. ఈ సందర్భంలో ఏదైనా జరిగి ఉండుంటే ఎవరు బాధ్యులు? అడ్డుకున్న సమయంలో బాలకృష్ణ వెంట టీడీపీ కార్యకర్తలు తక్కువ సంఖ్యలో ఉన్నారు. అదే పరిస్థితి ఆ రోజు అరగంట ముందు జరిగి ఉండుంటే పరిస్థితి వేరే. దీనిని దృష్టిలో ఉంచుకునైనా ఆయనకు ఎస్కార్ట్ కల్పించాల్సి ఉండేది. ఆయన పర్యటించే సమయంలో మంత్రి కోసం ప్రధాన కూడళ్లలో పోలీసులు భారీగా మోహరించి ఉన్నారు. అంత మంది బందోబస్తు అధికార పార్టీ నాయకులకు ఉన్నపుడు స్థానిక ఎమ్మెల్యేకు ఎందుకు ఎస్కార్ట్ కల్పించలేదన్నది అందరిలో మెదులుతున్న ప్రశ్న.



ఎస్కార్ట్ లేకుండా వెళ్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ కాన్వాయ్

పెనుకొండలో మంత్రి భర్తకు ఎస్కార్ట్

వైసీపీ పెనుకొండ నియోజకవర్గ నూతన ఇన్‌చార్జిగా నియమితురాలైన మంత్రి ఉషశ్రీ భర్త చరణ్‌రెడ్డికి సైతం ఎస్కార్ట్ ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గురువారం పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలంలో మంత్రి భర్త పర్యటించాడు. ఈ సందర్భంగా ఎస్ఐతోపాటు సిబ్బంది జీపుతో ఎస్కార్ట్‌గా వెళ్లడం కొసమెరుపు. మొన్నటి వరకు ఎమ్మెల్యే తమ్ముళ్లు మండలాల్లో పర్యటిస్తున్నా వారికి ఎస్కార్ట్ వెళ్లలేదు. మంత్రి భర్తకు ఎస్కార్ట్ వెళ్లడంపై ముక్కున వేలేసుకుంటున్నారు. వైసీపీ నాయకులు అధికారదర్పం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



మంత్రి భర్త వెంట పోలీసు ఎస్కార్ట్ జీపు

బెదిరిస్తే.. ముంచేస్తాం..

ప్రభుత్వానికి అంగన్‌వాడీల హెచ్చరిక



ఎస్మా జీఓ ప్రతులను గొల్లపల్లి రిజర్వాయర్‌లో నిమజ్జనం చేస్తున్న అంగన్‌వాడీలు

పుట్టపర్తి రూరల్/పెనుకొండ రూరల్, జనవరి 12: ఎస్మా ప్రయోగించి, బెదిరించాలని చూస్తే ప్రభుత్వాన్ని ముంచేస్తామని అంగన్‌వాడీలు హెచ్చరించారు. ఎస్మాకు బెదిరేది లేదని ఉద్ఘాటించారు. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 32వ రోజుకు చేరుకుంది. పెనుకొండ మండలంలోని అంగన్‌వాడీలు గొల్లపల్లి రిజర్వాయర్‌కు చేరుకుని, వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్మా జీఓ ప్రతులను గొల్లపల్లి రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు. వారు మాట్లాడుతూ.. సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మా ఉపయోగించడం దారుణమన్నారు. డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. జిల్లాకేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ముందు కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి మండలాలకు చెందిన అంగన్‌వాడీలు నిరసనలు కొనసాగించారు. హిందూపురంలో కలశాలతో అంగన్‌వాడీలు ర్యాలీ చేపట్టారు. వాటిని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉంచి, రాజ్యాంగాన్ని కాపాడాలని వేడుకున్నారు. అనంతరం దీక్షా శిబిరానికి చేరుకుని, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ముదిగుబ్బ, నంబులపూలకుంట, కదిరి, ఓబుళదేవరచెరువు, నల్లమాడ, ధర్మవరం, బత్తలపల్లి, లేపాక్షి, చిలమత్తూరులో అంగన్‌వాడీలు ఆందోళనలు చేశారు.



పురంలో సంతకాలు సేకరిస్తూ..

స్వచ్ఛ బీసీలను ఆదరించండి

బీసీలను పెళ్లి చేసుకుని రెడ్లు పాలిస్తున్నారు..: బీకే



జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న బీకే పార్థసారథి

రొద్దం, జనవరి 12: ప్రజలు స్వచ్ఛ బీసీలనే ఆదరించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి పిలుపునిచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బీసీ మహిళలను రెడ్డి సామాజిక వర్గం వారు పెళ్లి చేసుకుని, పెత్తనం చెలాయిస్తున్నారన్నారు. మండలంలోని ఆర్. మరువపల్లిలోగల రైస్ మిల్లులో శుక్రవారం జయహో బీసీ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన బీకే మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనేక మంది రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు కేవలం ఎమ్మెల్యేలుగా గెలవడానికి బీసీ, ఎస్సీ మహిళలను పెళ్లి చేసుకునానరని విమర్శించారు. వారిని ఎమ్మెల్యేలుగా నిలబెట్టి పెత్తనమంతా రెడ్డి సామాజికవర్గానికి చెందిన వ్యక్తులే చెలాయిస్తున్నారని మండిపడ్డారు. కళ్యాణదుర్గం, శింగనమల, హిందూపురం ప్రాంతాల్లో బీసీ, ఎస్సీలను అడ్డం పెట్టుకుని వైసీపీవారు రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు ఇప్పటికైనా గమనించి, స్వచ్ఛ బీసీలకు పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. పెనుకొండకు వలస పక్షులు వస్తుంటారు, దోచుకుని పోతుంటారనీ, బీకే పక్కా లోకల్ అన్నారు. మంత్రి ఉషశ్రీ అవినీతి అనకొండ అనీ, కళ్యాణదుర్గంలో దోచుకున్నది చాలదన్నట్లు పెనుకొండకు వచ్చారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ వారు పంచే డబ్బుతీసుకుని, టీడీపీకే ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, టీడీపీ కురుబ సాధికారత కన్వీనర్ గంగులకుంట రమణ, కుమ్మర సాధికారత కన్వీనర్ పోతులయ్య, వక్కళిగ సాధికారత కన్వీనర్ పాండురంగప్ప, జనసేన పెనుకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి కుమార్ పాల్గొన్నారు.

రండి.. బాబూ.. రండి..!

ఆడుదాం ఆంధ్రాకు క్రీడాకారులు కరువు

అధికారులకు తప్పని ఎదురుచూపులు

11.30 గంటలు దాటినా రాని క్రికెటర్లు

ఇవేం పోటీలు అంటూ విస్మయం



క్రీడాకారుల కోసం ఎదురుచూస్తున్న అధికారులు

అధికారులకు ఎదురుచూపులు

ఆడుదాం ఆంధ్రాకు క్రీడాకారుల నుంచి పెద్దగా స్పందన లేదు. దీంతో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో ఆటలు ఆడిస్తున్నారు. క్రీడాకారులు రాక ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాలు వెలవెలబోతున్నాయి. ఎలాగోలా గ్రామీణ స్థాయి క్రీడాపోటీల నిర్వహణ పూర్తయింది. దీంతో మండలస్థాయికి క్రికెట్, వాలీబాల్, టెన్నిస్ తదితర పోటీల్లో గెలుపొందినవారు మండలస్థాయికి ఎంపికయ్యారు. మండల స్థాయికి ఎంపికైన క్రికెట్ జట్ల కోసం ఈనెల 10వ తేదీన కొత్తచెరువులోని బాలుర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎంపీడీఓ బారాన్‌సాబ్, పీడీలు వెంకటేశ్, చంద్ర, ప్రభాకర్, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు.. ఎదురుచూడాల్సి వచ్చింది. 11.30 గంటలు దాటినా క్రీడాకారులు ఎవరూ రాకపోవడంతో మైదానంలోవేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఇవేం క్రీడాపోటీలు అంటూ అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తచెరువు, జనవరి 12: ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను పండుగలా నిర్వహించాలనీ, యువతలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలన్నదే లక్ష్యమని పాలకులు గొప్పలు చెప్పారు. ఆ దిశగా రూ.కోట్లు వెచ్చించి, క్రీడాసామగ్రి కూడా పంపిణీ చేశారు. టీషర్ట్‌లు ఇస్తున్నారు. పోటీల నిర్వహణకు అధికారులు ఠంచనుగా క్రీడా మైదానాల వద్దకు నిర్ణీత సమయానికి చేరుకుంటున్నారు. క్రీడాకారులే కనిపించరు. గంటలు గడిచిపోతున్నా రారు. వారి కోసం అధికారులు రోజంతా ఎదురుచూడాల్సి వస్తోంది. ఒక్కోరోజు క్రీడాకారులు లేక నిరాశగా వెనుదిరుగుతున్నారు. క్రీడాపోటీలు అంటే క్రీడాకారులు ముందుగానే శ్రద్ధగా వచ్చి ప్రాక్టీస్ చేయడమో, వేచిచూడడమో చేస్తారనీ, ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో మాత్రం వారి కోసం అధికారులే ఎదురు చూడాల్సి వస్తోందని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. 'రండి బాబూ.. రండి.. ఎవరో ఒకరు వస్తే.. ఆడించేస్తాం..' అన్నట్లుగా అధికారులు ఎదురుచూడాల్సి వస్తోంది.

విరిగిపోతున్న బ్యాట్లు



విరిగిపోయిన క్రికెట్ బ్యాట్లు

ప్రభుత్వం వంద కోట్ల రూపాయలతో ఆడుదాం ఆంధ్రా పోటీలకు నాణ్యమైన క్రీడా సామగ్రి అందించినట్లు చెబుతున్నా.. అవి ఏ మాత్రం పనికి రావని క్రీడాకారులు పేర్కొంటుండడం శోచనీయం. ప్రభుత్వం అందించిన క్రికెట్ బ్యాట్లు విరిగిపోతున్నాయనీ, సొంతంగా తెచ్చుకున్న వాటితోనే ఆడుతున్నామని క్రికెటర్లు పేర్కొంటున్నారు. ప్రభుత్వం క్రీడాకారులకు అందించే టీషర్టులు కూడా నాసిరకంగా ఉండడంతో క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. వాటిని వేసుకోవడానికి విముఖత వ్యక్తం చేస్తున్నారు. అధికారులు.. క్రీడాకారులు వచ్చేవరకు వేచి చూసి వారు వచ్చిన తరువాత పోటీలు నిర్వహించారు. క్రీడాపోటీలకు ఖర్చు చేయడానికి కూడా ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో పీడీలు, అధికారులు సొంత డబ్బు వెచ్చించి క్రీడా మైదానాలను శుభ్రం చేయించుకుంటున్నారు.

సొంత సామగ్రితోనే పోటీలకు..

అమడగూరు: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో సొంతంగా తెచ్చుకున్న సామగ్రితో పాల్గొనాల్సి వస్తోందని క్రీడాకారులు వాపోతున్నారు. అమడగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురువారం మండలస్థాయి క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. క్రీడాకారులకు టీషర్టులు, టోపీలు, బ్యాట్లు ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం పంపిణీ చేసిన టీషర్టులు, టోపీలు నాసిరకంగా, చిన్నవిగా ఉండడంతో క్రికెటర్లు వాటిని తీసుకోలేదు. బ్యాట్లు కూడా నాసిరకంగా ఉండడంతో సొంతంగా తెచ్చుకున్న వాటితో ఆడాల్సి వచ్చింది. క్రీడాకారులకు గ్రామస్థాయిలో కిట్లు ఇవ్వకుండా ఆయా పంచాయతీ కేంద్రాల్లో నిలువ ఉంచినట్లు సమాచారం. మండలస్థాయిలో కూడా కిట్లు ఇవ్వకపోవడం వెనుక అంతర్యమేమిటని క్రికెటర్లు ప్రశ్నిస్తున్నారు. కిట్లు పంపిణీ చేయకుండా అధికారులు కార్యాలయంలో ఉంచుకోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. తాగునీరు, నీడ తదితర వసతులు లేకుండా పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడాకారులు వాపోతున్నారు.



సొంత బ్యాట్లతో మ్యాచ్ ఆడుతున్న క్రికెటర్లు



క్రీడాకారులు లేక వెలవెలబోతున్న మైదానం

భోజనాలూ లేవు..

మడకశిర రూరల్: ఆడుదాం ఆంధ్రా పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. క్రీడాకారులకు భోజనం, తాగునీటి వసతి కల్పించడంతోపాటు ప్రథమ చికిత్స కిట్లు సిద్ధంగా ఉంచుకోవాల్సి ఉంది. అలాంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని నీలకంఠాపురం, గౌడనహళ్ళి ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన పోటీలకు హాజరైన క్రీడాకారులకు భోజన సౌకర్యం కూడా కల్పించలేదు. దీంతో క్రీడాకారులు సొంత డబ్బుతో భోజనాలు తెచ్చుకోవాల్సి వచ్చింది. తాగునీరు కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంచాయతీ కార్యదర్శులు.. సొంత ఖర్చులతో పోటీలకు హాజరైన పీఈటీలు, సిబ్బందికి భోజన వసతి కల్పించినట్లు తెలుస్తోంది.



గౌడనహళ్ళిలో సొంత ఖర్చులతో భోజనం తెచ్చుకుని తింటున్న క్రీడాకారులు

కందిపోయింది..!



- జిల్లాలో భారీగా తగ్గిన కంది దిగుబడి
- వర్షాభావంతో ఎండిన పంట
- ధరలున్నా కొనేవారు లేక రైతుల ఎదురుచూపు
- అన్నదాతకు తప్పని ఆవేదన

దిగుబడి తగ్గినా ధర పతనం

ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగైన కంది పంటలో ఇప్పటి దాకా 70 శాతం పంట కోత పూర్తయ్యింది. మరోవారం రోజుల్లో మిగతా విస్తీర్ణంలో పంట కోత పూర్తికానుంది. ఈ సారి పంట దిగుబడి భారీగా తగ్గింది. మరోవైపు ఎకరా పంట సాగు కోసం రూ.15వేల నుంచి రూ.20వేలు పెట్టుబడి పెట్టారు. సాధారణంగా పంట దిగుబడి తగ్గితే ధరలు పెరుగుతాయి. అయితే కంది పంట విషయంలో అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. నెలరోజుల క్రితం కంది క్వింటాల్ రూ. 13వేలు పలికింది. ప్రస్తుతం క్వింటా రూ.7వేలకు తగ్గింది. దళారులు కుమ్మక్కై పంట ధరను తగ్గించినట్లు సమాచారం. ప్రభుత్వం మద్దతు ధరతో కంది పంటను కొనుగోలు చేయడంపై దృష్టి సారించలేదు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఉంటే ధరలు తగ్గే పరిస్థితి ఉండేది కాదన్నది బాధిత రైతుల వాదన. కంది క్వింటాల్ కనీస మద్దతు ధర రూ.7వేలుగా ప్రభుత్వం నిర్ణయించింది. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం కనీస మద్దతు ధర రేటు ఉన్నప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే మరింతగా దళారులు బహిరంగ మార్కెట్‌లో తగ్గించి సొమ్ము చేసుకునే ప్రమాదం లేకపోలేదు. అసలే దిగుబడి తక్కువ కావడంతో పెట్టుబడి ఖర్చులు కూడా దక్కవని రైతులు వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కంది కొనుగోలు కేంద్రాలు త్వరగా ఏర్పాటు చేసేలా చొరవ చూపాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే రైతులు మరింతగా నష్టపోయే ప్రమాదం లేకపోలేదు. పాలకులు ఏ మేరకు చొరవ చూపుతారో వేచిచూడాల్సిందే.



యాడికిలో దిగుబడి లేని కంది పంట

అనంతపురం అర్బన్/యాడికి/ఉరవకొండ, జనవరి 12: కంది రైతుకు కష్టమొచ్చింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగైన కంది పంట వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భారీగా దిగుబడి తగ్గింది. అరకొరగా దిగుబడి రావడంతో పెట్టుబడులు కూడా రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు.

వర్షాలు లేక ఎండిన పంట

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 30వేల హెక్టార్లల్లో కంది పంట సాగు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో పంట సాగు విస్తీర్ణం తగ్గింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొందరు రైతులు తమ పొలాల్లో కందిని ఏక పంటగా సాగు చేశారు. మరికొందరు వేరుశనగ పంటతో కలిసి సాళ్లుగా వేసుకున్నారు. కంది పంట బాగా పండితే ఎకరాకు 6 నుంచి 9 క్వింటాళ్లదాకా దిగుబడి వస్తుంది. ఈసారి వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎకరాకు 2 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. మరికొన్నిచోట్ల ఎండిపోవడంతో దిగుబడి శూన్యంగా మారింది.

దిగుబడి తగ్గింది..



మూడెకరాల్లో కంది పంట సాగు చేశా. ఎకరాకు రూ.20 వేలు పెట్టుబడి పెట్టా. ఈ సారి వర్షాలు సరిగాపడకపోవడంతో ఎకరాకు 2 క్వింటాళ్లలోపే దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఈ లెక్కన పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఈసారి పూర్తిగా నష్టపోయాం. ప్రభుత్వమే ఆదుకోవాలి.

\- వెంకటనాయుడు, యాడికి

పెట్టుబడి కూడా రాదు..



10ఎకరాల్లో కంది పంట సాగు చేశా. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడి కూడా రాలేదు. పెట్టుబడి రూ.20వేలదాకా ఖర్చు అయింది. ఈసారీ భారీ నష్టాలు తప్పలేదు.

\- అల్లెప్ప, రైతు, ఉరవకొండ

కొనే వారే లేరు..



కొనే వారు లేక పంటలు కల్లాలోనే రాశులు పోసుకుని ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. వర్షాలు సరిగ్గా పడకపోవడంతో దిగుబడి తగ్గిపోయింది. పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

\- అశోక్, రైతు, ఉరవకొండ

రూ.70 వేలు పెట్టా..



ఐదు ఎకరాల్లో కంది పంట సాగు చేశా. దాదాపు రూ.70వేలు పెట్టుబడి పెట్టా. రెండు క్వింటాళ్లు కావడం కూడా రాక పోవడంతో నిలువునా నష్టపోయా..

\- రాంభూపాల్‌రెడ్డి, రైతు పిన్నేపల్లి, యాడికి మండలం

త్వరలో కంది కొనుగోలు కేంద్రాలు

అనంతపురం రూరల్, జనవరి 12: ప్రభుత్వం త్వరలో కంది పంట కొనుగోలుకు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని అనంతపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు రవి తెలిపారు. శుక్రవారం మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో నిర్వహించిన మండలస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. రబీలోపంట సాగు చేసిన రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలని, ఈకేవైసీ చేయించుకోవాలని అన్నారు. కంది పంట కొనుగోలు నేపథ్యంలో సదరు రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్ల నమోదు చేసుకోవాలన్నారు. బ్యాంక్ లింక్‌లేని రైతులు అకౌంట్ లింక్ చేయించుకోవాలన్నారు. వ్యవసాయాధికారిని సాయిలక్ష్మి, ఏఈఓ మురళికృష్ణ, అలేఖ్య, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆలమూరు సుబ్బారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీ రవి



ఉరవకొండలో కందులను కల్లాల్లో ఆరబోసిన రైతులు



మీడియాతో మాట్లాడుతున్న మదన్‌మోహన్‌రెడ్డి

15 నుంచి బండలాగుడు పోటీలు

దక్ష కన్‌స్ట్రక్షన్ అధినేత ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి

అనంతపురంరూరల్, జనవరి 12: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని ఎ.నారాయణపురంలో సోమవారం నుంచి రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు దక్ష కన్‌స్ట్రక్షన్ అధినేత ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎ.నారాయణపురంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఏటా పెద్ద ఎత్తున ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, ఈఏడాదీ అదే రీతిలో పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. రెండు రోజుల పాటు ఈ పోటీలు ఉంటాయని, న్యూకేటగిరి, సీనియర్ ఎద్దుల విభాగాల్లో పోటీల నిర్వహణ ఉంటుందని అన్నారు. న్యూ కేటగిరి విభాగంలో మొదటి బహుమతి యునికాన్ బైక్, సీనియర్ విభాగంలో మొదటి బహుమతి రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ ఇస్తామని అన్నారు. తొమ్మిదవ స్థానం వరకు నగదు బహుమతులు ఇస్తున్నామన్నారు. గుర్రపు స్వారీ నిర్వహణ కూడా ఉంటుందన్నారు. ఈ పోటీలకు ప్రజాప్రతినిధులతో పాటు రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి హాజరవుతారన్నారు. పోటీల వీక్షణకు వచ్చే వారికి భోజన సదుపాయం కల్పించామన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలు, రైతులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

20 నుంచి అనంత చిరుధాన్యాల పండుగ

- ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 12: 'మన పంటలు-మన వంటలు' అనే నినాదంతో ఈనెల 20వతేదీ నుంచి అనంత చిరుధాన్యాల పండుగ ప్రదర్శన జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఏఎఫ్ ఎకాలజీసెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ స్వచ్ఛందసంస్థలు, వ్యవసాయ పరిశోధన సంస్థలు, సామాజిక స్పృహ కలిగిన వ్యాపారుల సంయుక్త సహకారంతో ఈనెల 20, 21, 22వ తేదీల్లో మూడు రోజుల పాటు అనంత చిరుధాన్యాల పండగ-2024 నిర్వహిస్తామన్నారు. మొదటి రోజుప్రారంభోత్సవం, చిరుధాన్యాలతో ఆరోగ్యం, వాతావరణ మార్పులు అరికట్టే చిరుధాన్యాల సాగు అంశాలపై సదస్సు ఉంటుందన్నారు. రెండో రోజు చిరు ధాన్యాల సాగులో మెలకువలు, సహభాగ ధ్రువీకరణ పద్ధతి, స్వల్పకాలిక చిరుధాన్యాల రకాల సాగుపై వివరిస్తారన్నారు. చివరి రోజు చిరుధాన్యాల ప్రాసెసింగ్-విలువ ఆధారిత ఉత్పత్తులు అంశంపై శాస్త్రవేత్తలు ప్రసంగిస్తారని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మూడు రోజుల పాటు కళాకారుల బృందం పల్లెపాటలు, నాటికలు, తోలు బొమ్మలాటల ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రజల సంపూర్ణ ఆరోగ్యం, రైతుల సుభిక్షం కోసం ఆకాంక్షించే వారందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వైవి మల్లారెడ్డి

ఉద్యోగావకాశాలు పెంచడమే ధ్యేయం

- కలెక్టర్ గౌతమి



పోర్టల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం టౌన్, జనవరి 12: నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు పెంచడమే ధ్యేయంగా కొత్త ఎంప్లాయ్‌మెంట్ వెబ్‌సైట్ పోర్టల్‌ను ప్రారంభించామని కలెక్టర్ గౌతమి అన్నారు. జిల్లా ఉపాధి కల్పనాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం రూపొందించిన వెబ్‌సైట్ పోర్టల్ పోస్టర్లను క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ employment.ap.gov.in పోర్టల్‌ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి అవకాశాల సమాచారం తెలుసుకొని వాటికి ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. టెన్త్, డిగ్రీ, డిప్లమా ఇలా ఏ కోర్సులు చేసినా ఇందులో నమోదు చేసుకోవచ్చన్నారు. ఈసేవలు అన్ని జిల్లాల ఎంప్లాయ్‌మెంట్‌సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు, అభ్యర్థుల మొబైల్స్‌ద్వారా కూడా పొందవచ్చన్నారు. ఈవెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసిన వెంటనే, తాత్కాలిక రిజిస్ట్రేషన్ నెంబర్ మెసేజ్ ద్వారా పంపబడుతుందని, సంబంధిత జిల్లా ఎంప్లాయ్ అధికారి ఆమోదించిన వెంటనే వారికి ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్ నెంబరు తెలియజేయబడుతుందన్నారు. అభ్యర్థి తన ఎంప్లాయ్‌మెంట్‌కార్డు లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పెద్దనే హత్య చేయించారు..

వృద్ధుడి హత్య కేసులో భార్య, కుమారుడు, కుమార్తె అరెస్టు

ముదిగుబ్బ, జనవరి12: ఆస్తి కోసం ఇంటి పెద్దనే సుపారీ హత్య చేయించారు. భార్య, కుమారుడు, కుమార్తె జైలు పాలయ్యారు. ముదిగుబ్బ మండలం నాగారెడ్డిపల్లికి చెందిన పాపిరెడ్డి(60) మృతి మిస్టరీని పోలీసులు ఛేదించారు. శుక్రవారం పట్నం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ యతీంద్ర కేసు వివరాలను వెల్లడించారు. పాపిరెడ్డి పేరిట నాగారెడ్డిపల్లి వద్ద కొంత భూమి ఉంది. ఆ భూమిని తన కూతురు పేరిట రాయించమనీ, మరికొంత భూమిని అమ్మి వారు కొత్తగా నిర్మించుకున్న ఇంటి కోసం చేసిన అప్పులు తీర్చాలని లక్ష్మీదేవి, కూతురు చెరుకు తేజావతి, కుమారుడు వెంకటేశ్వర రెడ్డి అడిగారు. అందుకు అతడు ఒప్పుకోకపోవడమే కాకుండా, తాగి వచ్చి వారిని వేధిస్తుండేవాడు. పాపిరెడ్డి అడ్డు తొలగించుకోవాలనుకున్నారు. అదే గ్రామానికి చెందిన శివారెడ్డి, జయరాములుతో రూ.1.70 లక్షలకు సుపారీ కుదుర్చుకున్నారు. పథకం ప్రకారం గతేడాది నవంబరు 10వ తేదీన శివారెడ్డి, జయరాములు.. నాగారెడ్డిపల్లి సమీపంలోని మద్దిలేరు వాగు వద్దకు పాపిరెడ్డిని తీసుకెళ్లారు. మద్యం తాగించి, మత్తులో ఉన్న అతడి తలపై ఇద్దరూ కలిసి రాయితో మోది, హత్య చేశారు. రాత్రి 10 గంటల సమయంలో కుంట మధ్యలో ఉన్న జమ్ములో మృతదేహాన్ని దాచిపెట్టారు. పాపిరెడ్డి గత నవంబరు నుంచి కనిపించట్లేదని అతడి అన్న కృష్ణారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జనవరిలో మిస్సింగ్ కేసు నమోదు చేసి, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అనుమానిత వ్యక్తులను విచారిస్తుండగా పాపిరెడ్డి భార్య లక్ష్మీదేవి, కూతురు చెరుకు తేజావతి, కుమారుడు వెంకటేశ్వర రెడ్డి, అదే గ్రామానికి చెందిన శివారెడ్డి, జయరాములు ఈనెల 10న వీఆర్వో ద్వారా ముదిగుబ్బ సీఐ ఎదుట లొంగిపోయారు. నిందితులు తెలిపిన ప్రదేశానికి వెళ్లి పాపిరెడ్డి మృతదేహాన్ని వెలికి తీసి, అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. నిందితులు ఐదుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.



అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న సీఐ యతీంద్ర

జిల్లాకు 2001.75 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం అర్బన్, జనవరి 12: జిల్లాకు 2001.75 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ రవి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో డీఏపీ 1624.75 మెట్రిక్ టన్నులు, 20-20-0-13 రకం ఎరువులు 377 మెట్రిక్ టన్నులు సరఫరా అయ్యాయన్నారు.

పదవీ కాలం పొడిగింపు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 12: సహకార సొసైటీలు, ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్‌ల పాలకవర్గాల పదవీకాలం గడువు ఆరు నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర సహకార ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి జీఓ నంబర్లు 28, 31లను శుక్రవారం జారీ చేశారు. ఈనెల 18తో ముగియనున్న సహకార సొసైటీల పదవీకాలాన్ని జూలై 17 వరకు పొడిగించినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తద్వారా మరోసారి సహకార సొసైటీల ఎన్నికలు వాయిదా పడినట్లైంది. సాధారణ ఎన్నికల తరువాతే సహకార ఎన్నికలు ఉండవచ్చని అధికార వర్గాలు చెబుతున్నాయి.

రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న నందిత



అవార్డు అందజేస్తున్న ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్

అనంతపురం సెంట్రల్, జనవరి 12: ఎన్ఎస్ఎస్ ఉత్తమ వలంటీర్‌గా రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికైన ఆర్ట్స్ కళాశాల విద్యార్థి నందిత శుక్రవారం పురస్కార అవార్డును అందుకున్నారు. విజయవాడలో నిర్వహించిన సమావేశంలో ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారి అశోక్‌రెడ్డి, కళాశాలల ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ నందితను అభినందించి అవార్డులను అందజేశారని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ తెలిపారు. ఈ సందర్భంగా నందితను ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శశాకంకమౌళి తదితర అధికారులు నందితను అభినందించారు.

సామూహిక షష్టిపూర్తికి దరఖాస్తు చేసుకోండి

- బ్రాహ్మణ సంఘం చైర్మన్ సీఎస్‌కే శేషగిరిరావు

అనంతపురం కల్చరల్, జనవరి 12: అఖిల భారత బ్రాహ్మణ కల్యాణోపాధ్యాయ వివాహ సమాచార కేంద్రాల సంఘం (ఎఫ్ఓబీఎంఐఎస్) ఆధ్వర్యంలో తిరుపతిలోని కంచి పీఠంలో ఈ నెల 28న నిర్వహించనున్న ఉచిత సామూహిక షష్టిపూర్తి, భీమరథ శాంతి కోసం అర్హత గల బ్రాహ్మణులు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంఘం చైర్మన్ సీఎస్‌కే శేషగిరిరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆ కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. 60 సంవత్సరాలు నిండిన బ్రాహ్మణ దంపతులు షష్టిపూర్తికి, ఉగ్రరథ శాంతి, భీమరథశాంతి కోసం 70 సంవత్సరాలు నిండిన వారు ఈనెల 18వ తేదీలోపు 94409 22668 నంబరులో సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమానికి రాష్ట్రంతోపాటు జాతీయ స్థాయిలో బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఓబీఎంఐఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధులు ఆలూరు లక్ష్మీనరసింహశాస్త్రి, నార్పల మారుతి, నాగభూషణరావు, మదనపల్లి మురళీధర్, పట్నం శిశ్వేశ్వరరావు, నీరజ, పార్వంది జ్యోతి, లక్ష్మీనరమ్మ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

జాతీయ కబడ్డీ పోటీలకు హిమజ



హిమజకు క్రీడాదుస్తులు అందిస్తున్న డీఎస్‌డీఓ నరసింహారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 12: జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలకు జిల్లాకు చెందిన దాసరి హిమజ ఎంపికైంది. ఇటీవల అన్నమయ్య జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలలో ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్న కేఎస్ఎస్ బాలికల ప్రభుత్వ పాఠశాల 9వతరగతి విద్యార్థి హిమజ జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఎంపికైన హిమజను డీఎస్‌డీఓ నరసింహారెడ్డి శుక్రవారం స్థానిక డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో సన్మానించి అభినందించారు. ఈనెల 17వతేదీ నుంచి 27వతేదీ వరకు నిర్వహించే జాతీయ శిక్షణ శిబిరంలో పాల్గొనే హిమజ ఈనెల 28వతేదీ నుంచి రాజంపేటలో నిర్వహించే కబడ్డీ పోటీలకు ఏపీ రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిథ్యం వహించనుంది. కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్ సంధ్య, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సుగుణమ్మ, హిమజ తల్లిదండ్రులు లావణ్య, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమాన హోదా, హక్కులు కల్పించండి

ఎంఈఓ-2 యూనియన్ నాయకుల డిమాండ్

అనంతపురం విద్య, జనవరి 12: ఎంఈఓ-1తో సమాన హోదా, హక్కులను తమకూ కల్పించాలని ఎంఈఓ-2 యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని ఉపాధ్యాయభవన్‌లో శుక్రవారం ఎంఈఓ-2ల సమావేశం నిర్వహించారు. కొన్ని మండలాల్లో ఎంఈఓ-1లు.. ఎంఈఓ-2లకు సహకరించడం లేదన్నారు. జిల్లా విద్యాశాఖ ఎండీఎం, సమగ్రశిక్ష ఐటీ సెల్ విభాగం అధికారులు ఎంఈఓ-2లకు మాత్రమే ఫోన్లు చేసి ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. ఐటీ సెల్, సమగ్రశిక్ష అధికారులు ఎంఈఓ-2లతోనేకాకుండా ఎమ్మార్సీ సిబ్బందితో కూడా మాట్లాడాలని అన్నారు. కొత్తగా ఈ పోస్టులు సృష్టించారని, ఈ క్రమంలో విధులు సజావుగా నిర్వర్తించడానికి ఒక కంప్యూటర్, ప్రింటర్, ఫర్నిచర్‌ను ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్టీలు, ఐఈఆర్టీల జీతాల క్లెయిమ్స్, వర్క్‌డన్ స్టేట్‌మెంట్స్‌పై ఎంఈఓ-2 సంతకాలు ఉండేలా ఆదేశాలివ్వాలని డిమాండ్ చేశారు. తమ జీతాలు, ఇంక్రిమెంట్ల బిల్లులు డిప్యూటీ డీఈఓల సహకారంతో ఏడీ-1 నుంచి త్వరగా మంజూరయ్యేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఎంఈఓ-2లు గురుప్రసాద్, లింగానాయక్, ఓబుళపతి, భవానీ శంకర్, నారపరెడ్డి, రామాంజనేయులు, వాణీదేవి, సరిత రాణి, రమాదేవి, తిప్పేస్వామి, కృష్ణానాయక్, బాబు, శివప్రసాద్, బాషా, రామగోవింద్, హరికృష్ణ, మనోహర్ పాల్గొన్నారు.



సమావేశమైన ఎంఈఓ-2లు

'ఆడుదాం ఆంధ్రా'లో ఉద్రిక్తత

- వలంటీర్లు పాల్గొనడంపై అభ్యంతరం
- ఆటే ముఖ్యం.. ఇద్దరు వలంటీర్ల రాజీనామా

యాడికి, జనవరి12: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. యాడికి, వేములపాడు జట్ల మధ్య క్రికెట్ ఫైనల్ మ్యాచ్ నిర్వహించడానికి హైస్కూల్ మైదానంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. వేములపాడు జట్టులో నిబంధనలకు విరుద్ధంగా ముగ్గురు వలంటీర్లు ఉన్నారని యాడికి జట్టు అభ్యంతరం తెలిపింది. తాము తొలి మ్యాచ్ నుంచి ఆడుతూనే ఉన్నామని అప్పుడులేని అభ్యంతం ఇప్పుడెందుకని వేములపాడు జట్టు ఆటగాళ్లు (వలంటీర్లతో కలిసి) అధికారులతో తీవ్రంగా వాదించారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఫైనల్‌మ్యాచ్ ఎలా నిర్వహించాలో దిక్కుతోచక అధికారులు చేతులెత్తేశారు. అయితే వలంటీర్లను ఆడకుండా అడ్డుకుంటే వేములపాడు పంచాయతీలోని 16మంది వలంటీర్లు రాజీనామా చేస్తామని అధికారులను హెచ్చరించారు. పోలీసులు రంగప్రవేశం చేసి సర్దిచెప్పినా ఇరుజట్ల సభ్యులు వినలేదు. కొట్టాలపల్లి వైసీపీ నాయకుడు ప్రసాద్‌రెడ్డి వేములపాడు జట్టుకు మద్దతు తెలిపి అధికారులతో వాదనకు దిగారు. జట్టులో ఉన్న ముగ్గురు వలంటీర్ల చేత విధుల నుంచి వైదొలుగుతున్నట్లు ఉత్తరం రాసి ఎంపీడీఓకు ఇవ్వడానికి వెళ్లారు. అయితే అధికారులు మాట దాటవేసి అక్కడి నుంచి తప్పుకున్నారు. ఫైనల్‌మ్యాచ్ నిర్వహణలో అధికారుల తీరుపై ఇరుజట్ల క్రీడాకారులు అసహనం వ్యక్తం చేశారు. ఒకానొక దశలో ఎమ్మెల్యే పీఏ నుంచి ఫోన్ వచ్చిందని, వలంటీర్లు రాజీనామా చేస్తే మరలా తీసుకోమని, ఆట కొనసాగేటట్లు చూడాలని చెప్పినట్లు క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మ్యాచ్ కంటే వలంటీర్ ఉద్యోగం ముఖ్యం కాదని తేల్చి చెప్పారు.



అధికారులతో వాగ్వాదం చేస్తున్న క్రీడాకారులు

ఇద్దరు వలంటీర్ల రాజీనామా

'మాకు క్రికెట్ ఆటే ముఖ్యం... మీ వలంటీర్ ఉద్యోగం కాదు' అంటూ వేములపాడులో ఎల్లారెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి అనే ఇద్దరు గ్రామ వలంటీర్లు ఉద్యోగానికి శుక్రవారం రాజీనామా చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్‌ను వివరణ కోరగా ఎల్లారెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి తమ పోస్టులకు రాజీనామా చేస్తున్నట్లు లెటర్ అందజేసిన మాట వాస్తవమేనని తెలిపారు.



వివరాలు ఆరాతీస్తున్న పోలీసులు

నిరుద్యోగులను ఆదుకోని వైసీపీ: కందికుంట


సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట

కదిరి, జనవరి 12: నిరుద్యోగులను వైసీపీ ప్రభుత్వం ఏమాత్రం ఆదుకోలేకపోయిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొలుత జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా యువతకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను సీఎం జగన్ మోసం చేశారన్నారు. ఉమ్మడి జిల్లాలో ఓ ప్రజాప్రతినిధి దౌర్జన్యం మూలంగా పేరు మోసిన ఫ్యాక్టరీ అనంతపురం జిల్లాకు రాకుండా పోయిందని గుర్తు చేశారు. కియలో అనుబంధంగా ఉన్న పరిశ్రమలుకూడా రాలేదన్నారు. వైసీపీ సోషల్ ఇంజనీరింగ్ పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు టికెట్ ఇవ్వకుండా అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఎస్సీలకు టిక్కెట్లు మార్చడం, బీసీలకు స్థానాలు మార్చడం ఏరకమైన సామాజిక న్యాయమని ప్రశ్నించారు. ఈ చర్యలను తట్టుకోలేక అనేకమంది బీసీలు వైసీపీని వీడుతున్నారని చెప్పారు.

అధైర్యపడకండి.. అండగా ఉంటాం..

వైసీపీని వీడి టీడీపీ లోకి వచ్చే వారికి అండగా ఉంటామని, ఎవరూ అధైర్యపడవద్దని కందికుంట భరోసా ఇచ్చారు. నాలుగున్నర సంవత్సరాలుగా వైసీపీతో విసిగిపోయి టీడీపీలో చేరాలనుకునేవారికి ఏ ఇబ్బంది రాకుండా అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం తప్పుడు కేసులు నమోదు చేస్తే.. న్యాయపోరాటం చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు కొమ్మినేని గంగయ్యనాయుడు, డైమండ్ ఇర్ఫాన్, మోపూరి శెట్టి చంద్రశేఖర్, అహమ్మద్‌వలి, ఏసీపీ చౌదరి, టెలికాం బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం: గోనుగుంట్ల


గోనుగుంట్లకు గజమాలతో ఘన స్వాగతం పలుకుతున్న అభిమానులు

ముదిగుబ్బ, జనవరి12: వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ విమర్శించారు. గోనుగుంట్ల శుక్రవారం ముదిగుబ్బకు రావడంతో అభిమానులు భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. గజమాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం గోనుగుంట్ల స్థానిక అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత వాసవీ కల్యాణమండపంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ పాలనలో ధర్మవరం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఏవీ జరగలేదన్నారు. పైపెచ్చు అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు అధికమయ్యాయన్నారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక తాను ఎమ్మెల్యేగా ధర్మవరం నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. వైసీపీ పాలనలో ఎమ్మెల్యే కేతిరెడ్డి నాలుగు వేల కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించారన్నారు. జిల్లేడుబండ ప్రాజెక్టు కాంట్రాక్టర్, ఎమ్మెల్యే జేబు నింపడానికేనని ఆరోపించారు. మళ్లీ తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ధర్మవరం చెరువుకు హంద్రీనీవా ద్వారా సాగు, తాగునీరు తీసుకువస్తామని, నియోజకవర్గంలో మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట అనుచరులు నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, దేవేందర్ రెడ్డి, రెడ్డెప్ప, వాటర్ రవి, గుంజేపల్లి నారాయణస్వామి, బాల భాస్కర్, జయకృష్ణ, రామ్మోహన్, పీసీరేవురామాంజి, చంద్ర, ల్యాబ్‌నారాయణస్వామి, నెట్టెంభాస్కర్, నరేంద్ర, దిలీప్, గుర్రంచంద్ర, రాఘవ, మల్లయ్య, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థిక సాయం

ముదిగుబ్బ మండల కేంద్రంలో పలు సమస్యలతో బాధపడుతున్న పలువురిని గోనుగుంట్ల సూర్యనారాయణ పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. రమణాచారి, రిహానా, మల్లెలరమణ, నారాయణస్వామి, ముద్దుకృష్ణ, రామాంజనేయులు, కిష్టప్ప, మాజీ ఎంపీటీసీ ఇమాంసాబ్, మస్తానమ్మ, రంగమ్మ, వెంగముని, గంగన్న, హసేనమ్మ, భరత్, వహీదా, నరసింహులను పరామర్శించి ఒక్కొక్కరికి 15 వేల రూపాయలు చొప్పున అందించారు. కోనప్ప, మల్లికార్జునకు రూ.5 వేలు చొప్పున ఆర్థికసాయం చేశారు.

సామాజిక సమతా సంకల్పంపై ర్యాలీ

ధర్మవరం, జనవరి 12: పట్టణంలో సామాజిక సమతా సంకల్ప మహోత్సవ మారథాన్ కార్యక్రమంపై శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ ఈనెల 19న విజయవాడలోని స్వరాజ్ మైదానంలో డాక్టర్ అంబేడ్కర్ 125 అడుగుల స్మారక విగ్రహ ఆవిష్కరించనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఈ ర్యాలీ చేపట్టామన్నారు. పట్టణంలోని గాంధీనగర్ సర్కిల్ నుంచి కళాజ్యోతిసర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడి అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని నినాదాలు చేశారు. తర్వాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ, వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చూపిన మార్గంలో నడవాలి

పుట్టపర్తి: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చూపిన న్యాయమార్గంలో ప్రతిఒక్కరు నడవాలని డీఆర్వో కొండయ్య సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సామాజిక సమత సంకల్పంలో భాగంగా అంబేడ్కర్ ఛాయాచిత్ర ప్రదర్శనను డీఆర్వో ప్రారంభించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేడ్కర్ గొప్పదార్శనికుడని కొనియాడారు. ప్రతిఒక్కరు ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రమణారెడ్డి, ఎంపీపీ వెంకటరమణరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ తుంగా ఓబులపతి, సచివాలయం నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సాంఘిక సంక్షేమాధికారి శివరంగప్రసాద్, గిరిజన సంక్షేమశాధికారి మోహన్‌రావు, విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ-1 అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

కొత్తచెరువు, జనవరి 12: శ్రీసత్యసాయి జిల్లా ఎంఈఓ-1 అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర ప్రధానకార్యదర్శి రవినాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నామని జిల్లా అధ్యక్షుడు జిలాన్‌బాషా తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా చిన్నిక్రిష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు నాయక్, కోశాధికారిగా నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడిగా జాన్‌రెడ్డి, కొత్తచెరువు మండల సహాయ కార్యదర్శిగా మున్వర్‌బాషా, తలుపుల మండల కార్యదర్శిగా శ్రీకృష్ణనాయక్ తదితరులను ఎంపిక చేసినట్లు చెప్పారు.

తెలుగుయువత నాయకుడికి పల్లె పరామర్శ

ఓబుళదేవరచెరువు, జనవరి 12: కిడ్నీ సమస్యతో బాధపడుతున్న తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు బూదిలి ఓబుళరెడ్డిని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

27 మంది జూదరుల అరెస్టు

నంబులపూలకుంట, జనవరి 12: మండలంలోని రంగనపల్లి సమీపంలో గల కొండ ప్రాంతంలో పేకాట స్థావరంపై శుక్రవారం జిల్లా స్పెషల్ బ్రాంచ్ పోలీసులు దాడులు నిర్వహించినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో జూదమాడుతున్నట్లు తమకు సమాచారం వచ్చిందని, ఈ క్రమంలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు రంగనపల్లి గ్రామంలో దాడులు నిర్వహించారని చెప్పారు. జూదమాడుతున్న 27 మంది అరెస్టు చేశారని, వారినుంచి రూ.3, 24, 900 నగదు, 14 ద్విచక్రవాహనాలు, 21 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. జూదరులను కోర్టుకు హాజరు పరచినట్లు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

కదిరిఅర్బన్: మండలంలోని గట్లు సమీపంలో పేకాట స్థావరంపై దాడిచేసి 8మందిని అరెస్టుచేసినట్లు రూరల్ సీఐ సూర్యనారాయణ చెప్పారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో వెంటనే సిబ్బందితో కలిసి దా డులు చేశామన్నారు. 8మందిని అదుపులోకి తీ సుకుని, వారినుంచి రూ.31,040లు స్వాధీనం చే సుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మండలంలోని మరవతండా సమీపంలో రెండు వందల లీటర్ల నాటుసారా తయారు చేయడానికి ఉంచిన ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. దీనివిలువ రూ.12వేలు ఉంటుందన్నారు. సీఐతోపాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె


కదిరిలో గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కదిరిఅర్బన్, జనవరి 12: సమస్యలు పరిష్కరించాలంటూ పట్టణంలోని అంగన్‌వాడీ సిబ్బంది 32వ రోజైన శుక్రవారమూ నిరవధిక సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా వారు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గడ్డి తింటూ వినూత్న నిరసన తెలిపారు. పలువురు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు మాబూన్నీషా, సుజాత, శారద, లక్ష్మీదేవి, చంద్రకళ, సుశీల, రామలక్ష్మమ్మ, సీఐటీయూ నాయకులు జగన్‌మోహన్, రామమోహన్, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలో అంగన్‌వాడీలు 32వ సంఖ్య ఆకృతిలో కూర్చొని నిరసన తెలిపారు. పలువురు మాట్లాడుతూ తమ సమ్మె 32వ రోజుకు చేరిన సందర్భంగా ఆ సంఖ్య ఆకృతిలో కూర్చున్నామన్నారు. అలాగే సీఎం జగన్‌కు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షురాలు ఆశీర్వాదమ్మ, సీఐటీయూ నాయకులు లక్ష్మీనారాయణ, కుళ్లాయప్ప, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగించారు. వారికి ఏపీ రైతుసంఘం జిల్లాఅధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆదినారాయణ, అయూబ్‌ఖాన్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధానకార్యదర్శి నాగార్జున మద్దతు ప్రకటించారు.

నల్లమాడ: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

నంబులపూలకుంట: మండలకేంద్రంలోని బస్ షెల్టర్ వద్ద అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. వీరికి సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు.

తాడిమర్రి: మండలకేంద్రంలో అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. వీరికి సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ సంఘీబావం తెలిపారు.

ముదిగుబ్బ: మండలకేంద్రంలో అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. వారి సమ్మెకు మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ మద్దతు పలికి మాట్లాడారు. 32 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తర్వాత వారికి రూ.50వేలను విరాళంగా అందజేశారు.

ఘనంగా వివేకానందుడి జయంతి


నల్లమాడలో వివేకానందుడి చిత్రపటం వద్ద టీడీపీ శ్రేణుల నివాళి

పుట్టపర్తి, జనవరి 12: స్వామీ వివేకానందుడి జయంతి వేడుకలను పట్టణంలోని సంస్కృతి స్కూల్‌ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూయువకేంద్రం యువజన జాగృతి సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆయన చిత్రపటానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు రత్నాకరం కొండమరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత మాట్లాడుతూ వివేకానందుడి బోధనలు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతిఒక్కరూ ఆయన బోధనలను అనుసరించి ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో బాలలసంరక్షణాధికారి మహేష్, సొసైటీ ప్రతినిధి వెంకటేష్, న్యాయవాది హరిక్రిష్ణతో తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: పట్టణంలోని పద్మావతి డిగ్రీ కళాశాలలో వివేకానందుడి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మల్లికార్జున, అధ్యాపకులు పాల్గొన్నారు.

కదిరిఅర్బన్: పట్టణంలోని ఎస్‌టీఎస్ఎన్ డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సిత్మ, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లమాడ: మండలకేంద్రంలోని టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్ నివాసం వద్ద స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కన్వీనర్ కేశవరెడ్డి, నాయకులు బుట్టినాగభూషణంనాయుడు, చెన్నారెడ్డి, మైలేరామచంద్ర, ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం అయితే అందరికీ మేలు: టీడీపీ


ప్రశాంతిగ్రామ్‌లో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

పుట్టపర్తిరూరల్/ తాడిమర్రి, జనవరి 10: పట్టణంలోని ప్రశాంతి గ్రామ్‌లో శుక్రవారం టీడీపీ శ్రేణులు బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రజలకు కరపత్రాలు పంచుతూ మినీమేనిఫెస్టో పథకాలపై అవగాహన కల్పించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఏయే పథకాల వల్ల ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో తెలియజేశారు. చంద్రబాబు సీఎం అయితే అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. కావున వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు పవన్‌కళ్యాణ్, చెన్నప్ప, వెంకటరాముడు, నరసింహులు, నారాయణ, పీట్లరమణ, నాగరాజు, వెంకటేసు తదితరులు పాల్గొన్నారు. తాడిమర్రి మండలకేంద్రంలో టీఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ముంటిమడుగు హర్ష, ఎస్సీ సెల్ నాయకుడు గణేశ్, నాయకులు పక్కీర్‌రెడ్డి, సుధాకర్, భాస్కర్‌గౌడ్, కుళ్లాయరెడ్డి, రవీంద్ర నాయుడు తదితరులు భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో ముగ్గుల పోటీలు


ముగ్గులను పరిశీలిస్తున్న ఎస్పీ సతీమణి, ఏఓ సుజాత →

పుట్టపర్తిరూరల్, జనవరి 12: పట్టణంలోని జిల్లాపోలీసు కార్యాలయంలో శుక్రవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎస్పీ మాధవరెడ్డి దంపతులు విచ్చేసి పోటీలను ప్రారంభించారు. న్యాయ నిర్ణేతలుగా ఎస్పీ సతీమణి, ఏవో సుజాత వ్యవహరించి ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. ఇందులో మొదటి బహుమతి కానిస్టేబుల్ పద్మశ్రీ, ద్వితీయ బహుమతి మంజుల, తృతీయ బహుమతి హేమలతకు అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఈ సంక్రాంతి జిల్లా ప్రజలకు సుఖసంతోషాలను అందించాలని, ప్రజలందరూ పండుగను ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. తర్వాత ఎస్పీ దంపతులను డీఎస్పీ విజయ్‌కుమార్,ఏఆర్‌పోలీసులు, డీపీఓ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు, ఆర్ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌క్యాలెండర్ పేరుతో మోసం


మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న తెలుగుయువత నాయకులు

పుట్టపర్తి, జనవరి 12: అధికారంలోకి వస్తే ఏటా జాబ్‌క్యాలెండర్ పేరుతో లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పిన సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులను నిండా ముంచారని తెలుగుయువత నాయకులు మండిపడ్డారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం వారు వివేకానందుడి జయంతి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం నిరుద్యోగులను జగనన్నమోసం చేశారంటూ ప్లకార్డులతో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. యువతకు జాబురావాలంటే చంద్రబాబు సీఎం కావాలని చెప్పారు. కార్యక్రమంలో తెలుగుయువత నాయకులు అంబులెన్స్ రమేష్, పుల్లప్పచౌదరి, నరేష్‌కుమార్‌యాదవ్, సురేంద్రయాదవ్, సుధాకర్, మంజునాథ్, మురళీచౌదరి. గణేష్ చౌదరి, నగేష్, అశోక్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

అమడగూరు, జనవరి 12: మండలంలోని పూలకుంటపల్లికి చెందిన ప్రభాకర్ (42) ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రభాకర్ శుక్రవారం మధ్యాహ్నం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు తలుపులు పగులకొట్టి చూడగా అప్పటికే మృతిచెందాడు. ఎస్ఐ బలరామయ్య సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి రామచంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

మహిళ ఆత్మహత్యాయత్నం

ధర్మవరం, జనవరి 12: పట్టణంలోని 9వ వార్డు పరిధిలో గల చిన్నూరు గ్రామానికి చెందిన సరోజ శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఘటనపై వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. సరోజ తన భర్త నాగరాజును మద్యం తాగొద్దంటూ తరచూ హెచ్చరించేంది. ఈ క్రమంలో శుక్రవారం ఒకరినొకరు వాదులాడుకున్నారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను కిందకు దించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనం తపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ధర్మవరంరూరల్, జనవరి12: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో ప్రైవేటు పాఠశాలల యాజమానులు సెలవుల్లో కూడా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారని, అటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నామాలనాగార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ యుగేశ్వరిదేవికి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 9నుంచి 18వ తేదీ వరకు అన్నివిద్యాసంస్థలకు ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రకటించిందన్నారు. పట్టణంలోని కొన్ని ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసికంగా ఇబ్బంది పెడుతున్నాయని తెలిపారు. అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబ్‌జాన్, నాయకులు పాల్గొన్నారు.

మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

పుట్టపర్తిరూరల్, జనవరి 12: రాజకీయంగా మాదిగలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని సాయిఆరామంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బేకరి గంగాధర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇందులో పలువురు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఆరులక్షలమంది మాదిగలున్నారన్నారు. జనాభా ప్రాతిపదికన రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని కోరారు. ఈనెల 31న అనంతపురంలో జరిగే మాదిగల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని, పార్టీలకతీతంగా మాదిగలు ఏకమవ్వాలని సూచించారు. సమావేశంలో నాయకులు బీసీఆర్ దాస్, కేపీ నారాయణస్వామి, నాగరాజు, మునిసిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

'బీసీ వ్యతిరేకి వైసీపీ'

ధర్మవరం, జనవరి 12: ఎమ్మెల్యే, ఎంపీ టికెట్ల కేటాయింపులో వైసీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తీవ్రఅన్యాయం చేసిందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీఎస్టీ, బీసీ మైనార్టీల వ్యతిరేక ప్రభుత్వం నడుస్తోందన్నారు. నాలుగున్నరేళ్లలో 26 మంది బీసీలను పొట్టనపెట్టుకుందన్నారు. అదేవిధంగా 2700 మంది బీసీలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా దాడులు చేయించిందన్నారు. అంతేకాకుండా 26వేల మంది బీసీలపై వివిధ రకాల పోలీసు కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేసిందన్నారు. బీసీలకు సముచిత స్థానం టీడీపీలోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, నాయకులు ఫణికుమార్, నాగూర్‌హుస్సేన్, పోతుకుంట లక్ష్మన్న, కేశగాళ్ల శీనా, బొట్టుకిష్ట, బాలు, ఉస్మాన్ పాల్గొన్నారు.

శ్రీనివాస డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ధర్మవరం, జనవరి 12: పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కళాశాలలో శుక్రవారం బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె వెంకటకృష్ణకిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో జాబ్ మేళా జరిగింది. ఇందులో 62 మంది విద్యార్థులు హాజరయ్యారు. చెన్నయ్‌కు చెందిన ఏఎల్ఎల్ఎస్ఈసీ టెక్నాలజీ కంపెనీ ప్రతినిధులు మహమ్మద్ ఫాజిల్, రోషన్ జమీర్ ఇంటర్వ్యూలు నిర్వహించి 15 మందిని ఉద్యోగాలకు ఎంపికచేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మునల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో శ్రీబాలాజీ విద్యాసంస్థల ప్లేస్‌మెంట్ అధికారి బాబాఫక్రుద్దీన్, లెక్చరర్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన

నంబులపూలకుంట, జనవరి 12: ఈవీఎంల ద్వారా ఓటర్లు తమ ఓటు హక్కును ఏవిధంగా వినియోగించుకోవాలనేదానిపై బీఎల్వోలు శుక్రవారం అవగాహన కల్పించారు. తహసీల్దార్ నరేంద్రకుమార్ పర్యవేక్షణలో మండల వ్యాప్తంగా ఈవీఎంల ద్వారా ఓటు ఎలా వేయాలో తెలియ జేశారు. మరికొమ్మదిన్నె, తూర్పునడింపల్లి, గౌకనపల్లి, వెలిచలమల, వడ్డిపల్లి గ్రామాల పోలింగ్ కేంద్రాల పరిధిలో ఈ అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ క్రిష్టప్ప పాల్గొన్నారు.

కుష్టుకు సకాలంలో చికిత్స అందించాలి

బత్తలపల్లి, జనవరి 12: కుష్టు వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స అందించడం ద్వారా పూర్తిగా నయం చేయవచ్చని రాష్ట్ర కుష్టు నివారణ డైరెక్టర్ దేవనాగర్ తెలిపారు. మడలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. మండలంలో కుష్టు వ్యాధి గ్రస్తులు ఎంత మంది ఉన్నారు... వారికి ఎలాంటి చికిత్స అందిస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కుష్టును సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే నయమవుతుందని తెలిపారు. జిల్లా కుష్టు నియంత్రణ అధికారి తిప్పయ్య, వైద్యాధికారి గంగిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారిణికి సన్మానం

ధర్మవరం, జనవరి 12: జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్‌లో తృతీయస్థానంలో నిలిచిన ధర్మవరం పట్టణానికి చెందిన విద్యార్థిని కొత్త పద్మావతిని టీడీపీ నాయకులు సన్మానించారు. స్థానిక టీచర్స్‌కాలనీలో శుక్రవారం ఆ విద్యార్థిని ఇంటికి టీడీపీ నాయకులు వెళ్లి ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించారు. మహారాష్ట్రలో మూడు రోజుల క్రితం జరిగిన 69వ రాష్ట్ర సీనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో కొత్త పద్మావతి 3వ స్థానం సాధించడం అభినందనీయమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ అన్నారు. విద్యార్థినిని అభినందించిన వారిలో నాయకులు కొత్తచౌడప్ప ,జయలక్ష్మీ, పద్మావతి, ఓంప్రకాశ్, నాగరాజు, నరసింహులు, వెంకటరాముడు, చిన్నచౌడప్ప, లక్ష్మీనారాయణ, బిల్లే రామకృష్ణ, రాయపాటి శివ ఉన్నారు.

రంగవల్లుల పోటీలు

ధర్మవరం, జనవరి 12: పట్టణంలోని సత్యకృప మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. సుమారు 120 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఇందులో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న పావని మొదటి బహుమతికి, బీబీఏ ద్వితీయసంవత్సరం చదువుతున్న సాయికీర్తి రెండో బహుమతికి, బీబీఏ మొదటిసంవత్సరం చదువుతున్న గ్రీష్మా మూడో బహుమతికి ఎంపియ్యారు. అలాగే నాలుగో బహుమతిని సాయినిఖిత, ఐదో బహుమతిని నవ్యశ్రీ సాధించారు. వీరికి కరస్పాండెంట్ డోలా పెద్దిరెడ్డి, అధ్యాపక బృందం బహుమతులు ప్రదానం చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఓబుళదేవరచెరువు, జనవరి 12: మండలంలోని పెద్దగుట్లపల్లిక్రాస్ వద్ద శుక్రవారం అక్రమంగా తరలుతున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. నల్లమాడకు చెందిన పీ.ఆంజనేయులు కర్ణాటక నుంచి బైక్‌లో మద్యం తరలిస్తుండగా.. పెద్దగుట్లపల్లి క్రాస్ వద్ద అరెస్టు చేశామన్నారు. అనంతరం అతడి వద్ద ఉన్న 288 టెట్రోప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

నారా లోకేశ్‌ను కలిసిన టీడీపీ నాయకుడు

కొత్తచెరువు, జనవరి 12: టీడీపీ జాతీయప్రధానకార్యదర్శి నారా లోకేశ్‌ను కొత్తచెరువు మండలకేంద్రానికి చెందిన పార్టీ నాయకుడు ముద్దపాటి రవిచంద్ర శుక్రవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కష్టపడి పని చేయాలని నారాలోకేశ్ సూచించినట్లు రవిచంద్ర తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పుట్టపర్తి, జనవరి 12: సత్యసాయి హయ్యర్ సెండరీవిద్యార్థులు చేపట్టిన సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. పట్టణంలోని ప్రశాంతినిలయంలో గల సాయికుల్వంత్ హాల్లో శుక్రవారం రాత్రి సత్యసాయి విద్యార్థులు పదాత్మనం శ్రీజాం యహం అనే పేరుతో సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురాణాల్లోని పలు ఘట్టాలను ప్రదర్శించారు. సత్యసాయి ప్రేమతత్వం, అధ్యాత్మికత అనన్యమని, మానవాళికి శాంతిజీవనం చేకూరుస్తాయని నాటికద్వారా తెలిపారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

'నిధులను పక్కదారి పట్టించేందుకు కుట్ర'

తాడిమర్రి, జనవరి 12: గ్రామాల అభివృద్ధికి కేంద్రం పంపిన రూ.988 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించేందుకు కుట్ర పన్నుతోందని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్లభూషణ్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కేంద్రం విడుదల చేసిన నిధులలో రూ.600 కోట్లు ఇప్పటికే దారిమళ్లాయన్నారు. వాటిని నాలుగురోజులలోగా గ్రామపంచాయతీ ఖాతాల్లోకి జమచేయకుంటే రాజకీయాలకతీతంగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. గతంలో కూడా ఇదే విధంగా రూ.8629 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించిందని తెలిపారు.

హిందూపురం ఎంపీ టికెట్ అంబికాకు ఇవ్వాలి



అంబికా లక్ష్మీనారాయణకి ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరుతున్న వాల్మీకి నేతలు

చిలమత్తూరు, జనవరి 12: హిందూపురం పార్లమెంట్ స్థానాన్ని రాష్ట్ర వాల్మీకి సేవాదళ నాయకుడు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణకు కేటాయించాలని వాల్మీకి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో వాల్మీకి సంఘం నాయకులు సమావేశమై తీర్మానించారు. వారు మాట్లాడుతూ హిందూపురం పార్లమెంట్ పరిధిలో అత్యధికంగా వాల్మీకుల ఓట్లు ఉన్నాయని, దాని ఆధారంగానే వైసీపీ కూడా వాల్మీకికి చెందిన వ్యక్తులను ఎంపీ అభ్యర్థిగా పోటీకి దింపిందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని టీడీపీకి ఎన్నో ఏళ్లుగా సేవలు అందిస్తూ, ప్రజలకు సేవలు అందిస్తున్న అంబికా లక్ష్మీనారాయణకు ఎంపీ టికెట్టు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వాల్మీకి కులంలో ఓ ప్రత్యేక వ్యక్తిగా ఉంటూ వారి అభిమానాన్ని చూరగొంటున్న అంబికా లక్ష్మీనారాయణ టీడీపీ ఎంపీ అభ్యర్థి అయితే హిందూపురం ఎంపీ స్థానం అవలీలగా విజయం సాధిస్తుందన్నారు. వాల్మీకి సంఘం నాయకులు పాలడైరీ వెంకటేశులు, చిన్నప్ప, లింగప్ప, ఆంజనేయులు, గంగాధర, నాగేంద్ర, నరేంద్ర, రమేష్, మీసేవ సూరి, నారాయణస్వామి, అంజి, ఆదినారాయణ, రామాంజి, కిష్టప్ప, మూర్తి పాల్గొన్నారు.

సజావుగా సామాజిక తనిఖీ ప్రజావేదిక



ఉపాధి పనులపై ఏపీఓను అడిగి తెలుసుకుంటున్న పీడీ

అగళి, జనవరి 12: మండల కేంద్రంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక సజావుగా సాగింది. తనిఖీలో పీడీ విజయేంద్రప్రసాద్, ఏపీడీ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ రవిప్రసాద్, ఏపీఓ శివన్న, డీవీఓ రమణారెడ్డి, ఏఓ నాగేశ్వర్‌రావు, ఎస్ఆర్‌పీ కాంతయ్య పాల్గొన్నారు. 2022-23 ఏడాదిలో ఉపాధిహామీ పథకం ద్వారా మండల వ్యాప్తంగా రూ.6.70కోట్లు పనులను చేపట్టారు. అందులో రూ.31,578 రికవరీ చేశారు. మండల వ్యాప్తంగా ఉపాధిహామీ పనులు సజావుగా జరిగాయని అయితే ఇంకా ఎక్కువ మంది కూలీలు పనిలో చేరేవిధంగా సిబ్బందికి చూడాలని సూచించారు. 13 గ్రామ పంచాయతీలలో జరిగిన ఉపాధి హామీ పనులపై గ్రామాల వారీగా సామాజిక తనిఖీ బృందం వివరించారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని సర్పంచ్ ముద్దరాజు సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శ్రీధర్, అసిస్టెంట్ ఇంజనీర్ అభిజిత్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కమిటీ సభ్యుడు రియాజ్

పెనుకొండ, జనవరి 12: ముస్లింలకు ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని ఐక్యవేదిక రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ ఖలీల్, రాష్ట్ర కన్వీనర్ రియాజ్, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో విద్యా, వైద్య, ఉపాధి, రాజకీయ చైతన్యం సేవా కార్యక్రమాలే ఎజెండాగా ఐదు అంశాలపై బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం పెనుకొండలోని జామియా మసీదు వద్ద ముస్లింల ఐక్యవేదిక సభ్యులు సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ముస్లిం జనాభా దామాషా ప్రకారం తమకు రావాల్సిన ఎమ్మెల్యే, ఎంపీ సీట్లను కేటాయించాలన్నారు. సామాజిక వర్గం విద్యలో వెనుకబడి ఉందన్నారు. వారి పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించే వరకు వారిని ప్రోత్సహించాలన్నారు.

దేవదాయశాఖ ఈఓను నియమించండి

మడకశిర రూరల్ జనవరి 12: మడకశిర క్లస్టర్‌లోని దేవాలయాలకు ఈఓను నియమించాలనని భక్తులు కోరుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఈఓ 15 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఇక్కడ ఈఓ పోస్టుఖాళీగా ఉంది. భక్తరహళ్లి నరసింహస్వామి, జల్లేడుగుంట ఆంజనేయస్వామి, హేమావతి సిద్ధేశ్వరస్వామి, చందకచర్ల ఆంజనేయస్వామి, రత్నగిరి కొల్లాపురం, టీడీపల్లి, నందరాజనపల్లి ఆలయాలు దేవదాయ పరధిలో ఉన్నాయి. ఈఓ లేకపోవడంతో వాటి పర్యవేక్షణ లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధింత ఉన్నతాధికారులు స్పందించి ఈఓను నియమించాలని భక్తులు, అర్చకులు, ప్రజలు కోరుతున్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న ఎస్పీ సతీమణి, ఏఓ సుజాత

పుట్టపర్తిరూరల్, జనవరి 12: పట్టణంలోని జిల్లాపోలీసు కార్యాలయంలో శుక్రవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎస్పీ మాధవరెడ్డి దంపతులు విచ్చేసి పోటీలను ప్రారంభించారు. న్యాయ నిర్ణేతలుగా ఎస్పీ సతీమణి, ఏవో సుజాత వ్యవహరించి ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. ఇందులో మొదటి బహుమతి కానిస్టేబుల్ పద్మశ్రీ, ద్వితీయ బహుమతి మంజుల, తృతీయ బహుమతి హేమలతకు అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఈసంక్రాంతి జిల్లా ప్రజలకు సుఖసంతోషాలను అందించాలని, ప్రజలందరూ పండుగను ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం ఎస్పీ దంపతులను డీఎస్పీ విజయ్‌కుమార్,ఏఆర్‌పోలీసులు, డీపీఓ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చూపిన మార్గంలో నడవాలి

పుట్టపర్తి, జనవరి 12: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చూపిన న్యాయమార్గంలో ప్రతిఒక్కరు నడవాలని డీఆర్వో కొండయ్య సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సామాజిక సమత సంకల్పంలో భాగంగా అంబేడ్కర్ ఛాయా చిత్రప్రదర్శను డీఆర్వో ప్రారంభించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేడ్కర్ గొప్పదార్శనికుడని కొనియాడారు. ప్రతిఒక్కరు ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రమణారెడ్డి, ఎంపీపీ వెంకటరమణరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ తుంగా ఓబులపతి, సచివాలయం నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సాంఘిక సంక్షేమాధికారి శివరంగ ప్రసాద్, గిరిజన సంక్షేమశాధికారి మోహన్‌రావు, విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

27 మంది జూదరుల అరెస్టు

నంబులపూలకుంట, జనవరి 12: మండలంలోని రంగనపల్లి కొండ ప్రాంతంలో పేకాట స్థావరంపై శుక్రవారం జిల్లా స్పెషల్ బ్రాంచ్ పోలీసులు దాడులు నిర్వహించినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో జూదమాడుతున్నట్లు తమకు సమాచారం వచ్చిందని, ఈ క్రమంలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు రంగనపల్లి గ్రామంలో దాడులు నిర్వహించారని చెప్పారు. జూదమాడుతున్న 27మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.3.24 లక్షల నగదు, 14 ద్విచక్రవాహనాలు, 21 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

విచ్చలవిడిగా కలప అక్రమ రవాణా!

- యథేచ్ఛగా చెట్ల నరికివేత
- మామూళ్లమత్తులో అటవీశాఖ అధికారులు
- ట్రాక్టర్ లోడుకు రూ.500 వసూలు



రైల్వే బిడ్జి కింద ట్రాక్టర్‌లో తరలుతున్న కలప



పోచనపల్లి వద్ద నుంచి...

హిందూపురం అర్బన్, జనవరి 12: వాతావరణం కలుషితం కాకుండా మానవళిని కాపాడుతున్న పచ్చని చెట్లను విచ్చలవిడిగా నరికివేస్తున్నారు. యథేచ్ఛగా కలపను తరలిస్తున్నారు. వేసవిలో నీడనిచ్చే చెట్లు కనుమరుగు అవుతున్నాయి. ప్రతి రోజూ హిందూపురం సామిల్లులకు, ఇటుక బట్టీలకు, తూముకుంట పారిశ్రామిక వాడకు టన్నుల కొద్దీ కలప తరలించి కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. ఏ మాత్రం భయం లేకుండా ట్రాక్టర్‌లు, లారీల్లో కలప తరలిస్తున్నా అటవీ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. వాల్టా చట్టానికి తూట్లు పొడిచి వ్యాపారాలు చేస్తున్నారంటే అధికారులు ఏ మేరకు వ్యాపారులతో లాలూచి పడ్డారో అర్థం చేసుకోవచ్చు. ప్రతి రోజు పోచనపల్లి, శ్రీకంఠపురం, పరిగి పెనుకొండ రోడ్డు మార్గాల్లో కలప తరలుతోంది. చీకటి పడగానే కలప తరలిస్తున్నారు. అటవీశాఖ అధికారులు ఒక ట్రాక్టర్ లోడుకు రూ.500, లారీకి రూ.1500 వసూలు చేస్తున్నట్లు వ్యాపారులే బహిరంగంగా చెబుతున్నారు. చేయి తడిపితే ఎటువంటి ఇబ్బంది ఉండదని, లేనిపక్షంలో వేలకు వేలు అపరాధ రుసుం వేసి ట్రాక్టర్‌ను సీజ్ చేస్తున్నారని అంటున్నారు. ఇలా చెట్లు నరికివేయడంతో వాతావరణ సమతుల్యం దెబ్బతిని వర్షాలు కురవక కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదముంటుందని ప్రకృతి ప్రేమికులు వాపోతున్నారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు పంటపొలాల్లో వెంచర్ల వేసేందుకు అడ్డువస్తున్న చెట్లను నరికివేస్తున్నారు. అడవులు, పంట పొలాలు, తోటలు కనుమరుగు అవడంతో వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయి. ఇప్పటికైనా అటవీ అధికారులు చెట్ల నరికివేతను అడ్డుకోవాల్సిన అవసరం ఉంది.

ఊళ్లలోకి జంతువులు

చెట్లను నరికివేయడం, అడవులను ధ్వంసం చేస్తుండటంతో జంతువులు ఆసరా కోల్పోయి ఊళ్లలోకి వస్తున్నాయి. నిత్యం చిరుతలు, ఎలుగుబంట్లు ఊళ్లలో సంచరిస్తున్న విషయాలు పత్రికల్లో చూస్తూనే ఉన్నాం. ఇక జింకలు, దుప్పిలు, నెమళ్ల మేత కోసం పంటపొలాలవైపు వస్తున్నాయి. అడవులు నాశనం చేయడంతోనే ఈ పరిస్థితులు నెలకొంటున్నాయి.

విచారించి.. చర్యలు తీసుకుంటాం

ప్రతి రోజూ ట్రాక్టర్లు, లారీల ద్వారా కలప తరలుతోందనే విషయం తెలియదు. హిందూపురం ప్రాంతంలో మకాం వేసి కలప నరికివేయకుండా చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా అక్రమంగా కలప నరకడం, తరలించడం వంటివాటిని అరికడతాం. పట్టుబడిన వారిపై చర్యలు తీసుకుంటాం. సంబంధిత అధికారులపై కూడా నిఘా ఉంచుతాం. పారిశ్రామిక ప్రాంతంలో వంటచెరకు సరఫరా చేసుకుంటున్న ఫ్యాక్టరీలపై దాడులు చేసి చర్యలు చేపడతాం. -శ్రీనివాసరెడ్డి, ఫారెస్ట్ రేంజి అధికారి

మంత్రి సభలకు మహిళా సంఘాల సభ్యులే దిక్కు



కోడూరులో మంత్రి మాట్లాడుతుండగా వెళ్లిపోతున్న మహిళలు

చిలమత్తూరు, జనవరి 12: హిందూపురం నియోజకవర్గంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సభలకు మహిళా సంఘాలే పెద్ద దిక్కుగా మారాయి. చిలమత్తూరు మండలంలో శుక్రవారం పర్యటించిన సందర్భంగా వీరాపురం, దేమకేతేపల్లి, టేకులోడు, శెట్టిపల్లి, కోడూరు, కొడికొండ పంచాయతీల్లో మహిళా సంఘాల నుంచి మహిళలను బలవంతంగా తరలించినట్లు సమాచారం. ప్రధానంగా వెలుగు సిబ్బంది రెండు రోజులుగా మంత్రి సభలను విజయవంతం చేయాలన్న లక్ష్యంగా పనిచేసినట్లు సమాచారం. ప్రతి ఇంటికి వెళ్లి మంత్రి సభకు హాజరుకావాలని, లేని పక్షంగా ప్రభుత్వం నుంచి అందే పథకాలు రావని హెచ్చరించినట్లు తెలిసింది. దాంతో ప్రతి సభకు మహిళలను తీసుకువచ్చి మమ అనిపించారు. కోడూరులో జరిగిన సభలో మంత్రి ప్రసంగిస్తుండగా మహిళలు సభ నుంచి వెళ్లిపోవడం విశేషం.

ఎమ్మెల్యే అభ్యర్థుల బయోడేటా స్వీకరణ

హిందూపురం అర్బన్, జనవరి 12: ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేయాలనే ఆశావహుల బయోడేటాను బీజేపీ త్రిసభ్య కమిటీ స్వీకరించింది. శుక్రవారం స్థానిక రాజధాని ఫంక్షన్ హాల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు ఆదేశాలతో ప్రతి జిల్లాలోను త్రిసభ్య కమిటీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసే వారి అభ్యర్థనలు స్వీకరించారు. హిందూపురం నియోజకవర్గంలో త్రిసభ్య కమిటీ నాయకులు పత్రాప్‌రెడ్డి, చిట్టిబాబు, బాలకృష్ణ యాదవ్ హాజరయ్యారు. హిందూపురం బీజేపీ తరఫున పోటీ చేయాలని 11 మంది ఆశావహులు తమ అభ్యర్థనలు త్రిసభ్య కమిటీకి అందించారు. అభ్యర్థనలు అందించిన వారిలో హిందూపురం అసెంబ్లీ కన్వీనర్ ఆదర్శ్‌కుమార్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పీడీ పార్థసారథి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌రెడ్డి, 11వ వార్డు అంజలి రమేష్‌రెడ్డి, ఓబీసీ రాష్ట్ర నాయకులు కేవీ చలపతి, సీనియర్ నాయకుడు రమణమూర్తి, మహిళా మోర్చా కార్యదర్శి భాగ్యలక్ష్మీగౌడ్, సీనియర్ నాయకురాలు గీతాంజలి, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు తిరుమలేష్, వికసిత్ భాతర్ కన్వీనర్ మేడకుర్తి హరి, వెంకటశివప్ప ఉన్నారు.

'సామాజిక తనిఖీ ప్రజావేదికను తేలిగ్గా తీసుకోవద్దు'

అగళి, జనవరి 12: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అగళి మండల కేంద్రంలో చేపడుతున్న సామాజిక తనిఖీ ప్రజావేదికను తేలిగ్గా తీసుకోవద్దని డీవీఓ రమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 17వ సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహించారు. అనంతరం ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. 16వ సామాజిక తనిఖీ రికవరీ బకాయిలు 17వ సామాజిక తనిఖీ రికవరీలు తక్షణమే చెల్లించాలని అలాకాని పక్షంలో ఎస్ఆర్పీ ఏది రికార్డులు నమోదు చేసి ఉంటారో దాని మూలంగా చర్యలు తీసుకుంటామన్నారు. పేర్లవారీగా చెల్లించాల్సిన బకాయిలను వారికి వివరించారు. ఏపీఓ శిన్నకు, రికవరీలు చెల్లించని వారిపై చర్యలు తీసుకుని జీతాలు నిలిపివేయాలని సూచించారు.

ఉపాధి పనుల్లో రూ.42,871 అక్రమాలు

రొళ్ల, జనవరి 12: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ఆయా గ్రామాలలో జరిగిన పనుల్లో రూ.42,871 అక్రమాలు జరిగినట్లు ఎస్ఆర్‌పీ కాంతయ్య తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం సామాజిక బృందం ప్రజావేదిక నిర్వహించారు. 2022ఏప్రిల్ నుంచి 2023మార్చి వరకు 17వ విడత సోషల్ ఆడిట్ కార్యక్రమం నిర్వహించారు. సామాజిక బృందంవారు తనిఖీ చేశారు. ఉపాధి హామీ పథకం కింద రూ.4,91,37,403 ఖర్చు చేశారు. పీడీ విజయేంద్రప్రసాద్, సీడీఓ రమణారెడ్డి, ఏపీడీ లక్ష్మీనారాయణ, ఏపీఓ ఓబుళప్ప, నాగరాజు, కాంతయ్య, ఎంపీడీఓ ఆజాద్, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

రేపు ముగ్గుల పోటీలు

పావగడ, జనవరి 12: మకరసంక్రాంతి సందర్భంగా హెల్ప్‌సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గులపోటీలు నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్ తెలిపారు. సాయిబాబా నగర్‌లోని సాయిబాబా ఆలయప్రాంగణంలో ఆదివారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు పోటీలు ఉంటాయన్నారు. మొదటి బహుమతి రూ.5,001, రెండో బహుమతి రూ.3001, మూడో బహుమతి రూ.2001 అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ముగ్గులకు కావాల్సిన రంగులన్నీ వారే స్వయంగా తెచ్చుకోవాలని ఆయన సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం అర్బన్, జనవరి 12: పట్టణ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లి కొట్నూరు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగలకింద పెరిగిన చెట్టు కొమ్మల తొలగింపు కారణంగా అంతరాయం ఉంటుందన్నారు. కొట్నూరు సబ్‌స్టేషన్ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లి, సిండిరెడ్డిపల్లి, కొల్లకుంట, కొట్నూరు, చిన్నగుడ్డంపల్లి, పెద్దగుడ్డంపల్లి, నందమూరినగర్, మనేసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని మనేసముద్రం, ఊటకూరు, మలగూరు, గొల్లపల్లి, ఎర్రగుంట్ల గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

యువత.. ప్రపంచంతో పోటీ పడాలి

- చిక్‌బళ్లాపూర్ ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

పావగడ, జనవరి 12: యువత ప్రపంచంతో పోటీ పడినపుడే విజయతీరాలకు చేరుకుంటారని చిక్‌బళ్లాపూర్ ఎమ్మెల్యే ప్రదీప్‌ఈశ్వర్ అన్నారు. శుక్రవారం ఎస్ఎస్‌కే రంగమందిరంలో విస్తారా చానల్ ఎస్ఎస్‌కే సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామివివేకానంద రాష్ట్ర యువజన దినోత్సవ కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నేటి యువత ప్రపంచంతో పోటీపడే అవకాశం ఉండి ఆ సమయాన్ని వృథాచేసి సెల్‌ఫోన్‌లతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులను దైవంగా భావించి వారిని పూజిస్తే ప్రతి ఒక్కరి జీవితంలోనూ విజయం తనంతట తానే వరిస్తుందని హితువు పలికారు. ఎంతటిక్లిష్టమైన పరిస్థితుల్లోనూ అధైర్యపడకుండా తమ లక్ష్యం సాధించేవరకు పట్టుదల వదలవద్దని వివేకానంద చెప్పిన మాటలు గుర్తుచేశారు. అనంతరం ఆయన స్థానిక శనేశ్వరాలయం, యోగినారాయణస్వామి ఆలయాన్ని సందర్శించి మొక్కుబడి తీర్చుకున్నారు. పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్, విశ్రాంత న్యాయాధికారి బిల్లప్ప, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు



15వ వార్డులో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

మడకశిరటౌన్, జనవరి 12: వైసీపీ అవినీతి పాలనకు చరమగీతం పాడాలన్నా రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు సాగాలన్నా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని జిల్లా మైనారిటీ అధ్యక్షుడు భక్తర్, పట్టణ అధ్యక్షుడు మనోహర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 15వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పేదలకు సంక్షేమ ఫలాలు అందాలన్నా, అన్నివర్గాలకు న్యాయం జరగాలన్నా ఒక్క చంద్రబాబుతోనే సాధ్యం అన్నారు. వైసీపీ పాలనలో కొందరికి మాత్రమే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, టీడీపీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. పట్టణ అధ్యక్షుడు తిమ్మరాజు, కౌన్సిలర్ నరసింహరాజు, బూత్ కన్వీనర్ రామాంజనేయులు, శశికుమార్ పాల్గొన్నారు.

శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠను పండుగలా జరుపుకుందాం



అయోధ్య రాముడి అక్షింతలు, బ్రోచర్లు అందిస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

పెనుకొండ, జనవరి 12: అయోధ్య శ్రీరామ మందిరంలో 22వ తేదీన నిర్వహిస్తున్న శ్రీరాముని విగ్రహప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆ రోజు ప్రతి ఒక్కరూ పండుగలా జరుపుకోవాలని విశ్వహిందూ పరిషత్ ప్రఖండ్ అధ్యక్షుడు వేదవ్యాస్ కోరారు. విశ్వ హిందూపరిషత్ సభ్యులు ప్రతి ఇంటికీ వెళ్లి అయోధ్య అక్షింతలు, అయోధ్య రామమందిరానికి సంబంధించిన బ్రోచర్లు అందజేశారు. 22న స్థానిక రామభద్రాలయంలో ఉదయం వేద పండితుడి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, నిర్వహిస్తున్నామన్నారు. పట్టణంలోని అన్ని ఆలయాల్లో దీపారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని శ్రీరాముని కృపకు పాత్రులు కావాలన్నారు.

హిందూపురం: యదువంశతిలకుడు, దశరథనందనుడు అయిన అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన పవిత్ర అక్షంతలను శుక్రవారం పట్టణంలోని 24, 25వ వార్డుల్లో ప్రజలకు అందించారు. వాసవీ ధర్మశాల రోడ్డు, కంసలపేట, వేంకటేశ్వరథియేటర్ ప్రాంతం, మెయిన్‌బజార్‌లో ప్రతి ఇంటికి అక్షంతలు, అయోధ్య రామ మందిర చిత్రపటం, ఆహ్వాన పత్రికను అందించారు. 22వ తేదీన ప్రతి ఇంటిలో 5 దీపాలు వెలిగించాలని సూచించారు. రామసేవకులు ఆదర్శ్‌కుమార్, మంజునాథ్, కౌశిక్, చైతన్య, రామకృష్ణ పాల్గొన్నారు.

తుమ్మల మారెమ్మకు ప్రత్యేక పూజలు



అలంకరణలో అమ్మవారు

గుడిబండ, జనవరి 12: మండల కేంద్రంలో వెలసిన తుమ్మల మారెమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి విశేష అలంకరణ గావించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

103 మంది ఉద్యోగాలకు ఎంపిక

మడకశిరటౌన్, జనవరి 12: పట్టణంలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడాప్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాలో 103 మందిని వివిధ కంపనీల ప్రతినిధులు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య తెలిపారు. జాబ్ మేళాకు 11 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారని, అందులో నియోజకవర్గవ్యాప్తంగా 266 మంది యువకులు హాజరుకాగా 103 మంది ఎంపికయ్యారన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మెకానిక్‌కు గాయాలు

గోరంట్ల, జనవరి 12: పట్టణంలోని మదీనా మసీదు వీధిలో ద్విచక్రవాహనం బోల్తాపడిన ఘటనలో మెకానిక్ మంజునాథ్ తీవ్రంగా గాయపడ్డాడు. పుట్టపర్తి మండలంలోని పెడబల్లికి చెందిన మంజునాథ్ ద్విచక్రవాహనాల మెకానిక్ షెడ్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. అవసరమైన ద్విచక్రవాహనాల పరికరాల కోసం శుక్రవారం గోరంట్లకు వచ్చాడు. వాహనం నడుపుతుండగా మంజునాథ్‌కు ఉన్నఫలంగా ఫిట్స్ రావడంతో ప్రమాదం జరిగినట్లు తెలిసింది. తలకు బలమైన గాయం కావడంతో అపస్మారకస్థితిలో ఉండగా, స్థానికులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమచికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో అనంతపురం తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

అమడగూరు, జనవరి 12: మండలంలోని పూలకుంటపల్లికి చెందిన ప్రభాకర్ (42) ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రభాకర్ శుక్రవారం మధ్యాహ్నం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు తలుపులు పగులకొట్టి చూడగా అప్పటికే మృతిచెందాడు. ఎస్ఐ బలరామయ్య సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి రామచంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

మహిళ ఆత్మహత్యాయత్నం

ధర్మవరం, జనవరి 12: పట్టణంలోని 9వ వార్డు పరిధిలో గల చిన్నూరు గ్రామానికి చెందిన సరోజ శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఘటనపై వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. సరోజ తన భర్త నాగరాజును మద్యం తాగొద్దంటూ తరచూ హెచ్చరించేంది. ఈ క్రమంలో శుక్రవారం ఒకరినొకరు వాదులాడుకున్నారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను కిందకు దించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.



హిందూపురంలో కలశాలు మోస్తూ అంగన్‌వాడీల నిరసన



అగళిలో షోకాజ్ నోటీసులు ఇస్తున్న సూపర్‌వైజర్



గోరంట్లలో గడ్డి తింటూ...

అంగన్‌వాడీల వినూత్న నిరసన

అంగన్‌వాడీ కార్యకర్తలు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని వినూత్న నిరసన చేపట్టారు. అంగన్‌వాడీల సమ్మె శుక్రవారం 32వ రోజూ కొనసాగింది. హిందూపురం సద్భావన సర్కిల్ నుంచి కలశాలను మోస్తూ అంబేడ్కర్‌కు సమర్పించారు. అగళిలో దీక్షలో పాల్గొన్న అంగన్‌వాడీలకు అధికారులు నోటీసులు అందజేశారు. గోరంట్లలో గడ్డి తింటూ నిరసన తెలిపారు. చిలమత్తూరులో అంగన్‌వాడీలు తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని అమ్మవారికి మొక్కుతూ వేడుకున్నారు. మడకశిరలో 32వ ఆకారంతో కార్యకర్తలు కూర్చొని నిరసన తెలిపారు. - ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



చిలమత్తూరులో అమ్మవారికి మొక్కుతూ...



మడకశిరలో 32 ఆకారంలో...